రెండు దశాబ్దాల తర్వాత 'వరి'

- ఐదేళ్ల క్రితం వరకూ పరిగి మండలంతో కరాళనృత్యం చేసిన కరువు
- అత్యంత కరువు మండలాల్లో టాప్
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక మారిన పరిస్థితులు
- వర్షాలు బాగా పడటంతో బోర్లు రీచార్జ్
- 300 ఎకరాల్లో వరిసాగు

ఆర్బీకేలు, వివిధ సంక్షేమ పథకాలతో అన్ని విధాలా రైతుకు అండగా నిలుస్తున్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్. ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నింటినీ నెరవేరుస్తున్నారు. దీనికి తోడు ప్రకృతి కూడా కరుణించడంతో రైతులు ప్రశాంతంగా వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. బోర్లు రీచార్జ్ కావడంతో పరిగి మండలంలో 20 ఏళ్ల తర్వాత అధిక శాతంలో అన్నదాతలు వరిసాగు చేస్తున్నారు.


పైడేటి వద్ద వరి నాట్లు వేస్తున్న మహిళా కూలీలు

పరిగి: ఐదేళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు దేశంలోనే అత్యంత కరువు మండలాల్లో పరిగి మండలం కూడా ఒకటి. కనీస వర్షాపాతం నమోదు కానీ పరిగి మండలంలో మూడు ప్రధాన చెరువులు, ఏడు చిన్న చెరువులు, నీటి కుంటలు ఉన్నాయి. 1990వ దశకానికి ముందు ఈప్రాంతమంతా చెరుకు, వరి తదితర వాణిజ్య పంటలతో కళకళలాడేది. ఆ తరువాత నెలకొన్న తీవ్ర వర్షాభావంతో ప్రతి యేటా పంటల సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. దీంతో సాగుకే కాకుండా తాగునీటికి కూడా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వరుస కరువుతో రైతులు, పాడి పశు సంపద కనుమరుగయ్యే పరిస్థితి ఉండేది. చేసేది లేక వేలాది కుటుంబాలు వలసలు పోయారు.

మారిన పరిస్థితులు

గడిచిన నాలుగున్నర సంవత్సరాలుగా రాష్ట్రంలో వర్షాలు బాగా కురిశాయి. కరువు మండలంగా పేరొందిన పరిగి మండలంలో సైతం సకాలంలో వర్షాలు పడ్డాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తొలి ఏడాదిలోనే హంద్రీనీవా కాలువ ద్వారా మడకశిర బ్రాంచ్ కెనాల్ నుంచి కృష్ణా జలాలను పరిగి మండలంలోని పలు ప్రధాన చెరువులకు వదలడంతో చెరువులతో పాటూ నీటి కుంటలకూ నీళ్లు చేరాయి. దీంతో పాటూ వరుణదేవుడు కరుణించడంతో పాటూ ఏడాది క్రితం వరకూ పెన్నా, జయమంగళీ నదులు నీటితో ఉధృతంగా ప్రవహించాయి. ఈ క్రమంలో మండలంలోని చెరువులన్నీ నీటితో నిండి మరువలు పారాయి. ఫలితంగా భూగర్భజలాలు పెరగడంతో రైతుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. ఎండిపోయిన బోర్లు సైతం నేడు రీచార్జ్ అయి నీళ్ల వస్తున్నాయి. మూడేళ్లుగా వర్షాధార పంటలతో పాటూ వాణిజ్య పంటలపై రైతులు ఆసక్తి కనపరిచారు. ప్రధానంగా మొక్క జొన్న, మిరప, పత్తి, కంది, మల్బరీ తదితర పంటలు విస్తారంగా సాగు చేస్తున్నారు.

వరి సాగుపై అధిక ఆసక్తి

నాలుగున్నరేళ్ల క్రితం మండలంలో వరి సాగు అన్నది దాదాపుగా కనుమరుగైపోయింది. ఊటుకూరు, బీచిగానిపల్లి తప్పా మరెక్కడా వరి పంట సాగయ్యేది కాదు. పైగా మండలమంతా కలిపినా ఇరవై ఎకరాల్లోపై వరి సాగు చేసేవారు. అయితే ప్రతి యేడాది వరుసగా వర్షాలు పడటంతో రెండేళ్ల చెరువుల్లోకి నీరు వచ్చింది. పైగా దాదాపు మూడ్నేళ్ల పాటూ పెన్నా జయమంగళీ నదులు ప్రవహించడంతో నీటి శాతం వృద్ధి చెంది భూగర్భజలం స్థాయి పెరిగింది. ఫలితంగా వ్యవసాయ బోర్లలో నీటి మట్టాలు పెరిగాయి. దీంతో పాటూ నదీ పరివాహక గ్రామాల పరిధిలోని రైతులు ఫిల్టర్ బోర్లను వేయించి, పంటలను సాగు చేస్తున్నారు. దీంతో ఇరవై ఏళ్లుగా సాగు చేయని రైతులు ఎంతో మంది నేడు వరి సాగును చేస్తున్నారు. ప్రధానంగా ఊటుకూరు, అక్కంపల్లి, బీచిగానిపల్లి, వంగలపల్లి, పైడేటి, విట్టాపల్లి, పరిగి, పి నరసాపురం, బీరేపల్లి, కొత్తపల్లి, సంగమేశ్వరంపల్లి, శాసనకోట, మోదా తదితర గ్రామాల్లో వరి సాగు చేస్తున్నారు. ఈయేడాది రబీ సీజన్‌లో దాదాపు 300 ఎకరాలు వరి సాగు అయినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ యేడాది వర్షాలు లేకపోవడంతో వర్షాధార పంటలు సాగు చేయలేకపోయామని రైతులు చెబుతున్నారు. అయితే బోర్ల కింద మాత్రం వరి, మొక్క జొన్న, మిరప, రాగి తదితర పంటలతో పాటూ చిరుధాన్యాలను సాగు చేశామంటున్నారు.

ఇరవై ఏళ్ల తర్వాత వరి సాగు చేస్తున్నా



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు మంచి ప్రోత్సాహకాలను ఇస్తున్నారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విత్తనాలు, ఎరువులతో పాటూ ప్రతి యేటా రైతు భరోసా పథకం కింద నగదును జమ చేయడంతో మాకు వ్యవసాయాన్ని పండుగలా మార్చారు. ఎర్రగుంట రెవెన్యూ పరిధిలో మాకున్న వ్యవసాయ భూమిలో బోరు కింద ప్రస్తుతం వరి సాగు చేశాం. ఒకటిన్నర ఎకరం పొలంలో వరి సాగు చేస్తున్నాను. ఎకరానికి దాదాపు 30 వేల వరకూ ఖర్చు అయింది. భూమికి తనువు పెరగడానికి వరి సాగు చేస్తే తదుపరి సాగుకు భూమి అనువుగా మారుతుంది.

– బాలకృష్ణ, రైతు, ఎర్రగుంట

వరి సాగు విస్తీర్ణం పెరిగింది



గతంలో కంటే ఈసారి రబీలో వరి సాగు విస్తీర్ణం పెరిగింది. వర్షాలతో చెరువులు నిండటంతో పాటు నదుల్లో నీటి ప్రవాహం జరగడంతో పరివాహక ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. పైగా దాదాపుగా సాగు నీటి బోర్లు రీచార్జ్ అయ్యాయి. దీంతో భూమి తనువు కోసం వరి సాగుపై రైతులు ఆసక్తి కనపరుస్తున్నారు. మండలంలో దాదాపుగా 300 ఎకరాల్లో వరి సాగు చేశారు.

– విజయభారతి, ఏఓ, పరిగి

టీడీపీని బంగాళాఖాతంలో కలపడం ఖాయం


పెద్దమంతూరులో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్


టీడీపీ కుటుంబాలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

రొద్దం: 'సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జోరుగా సాగుతున్నాయి. చంద్రబాబు ఎన్ని నక్కజిత్తులు వేసినా, ఎంత మందితో కలసి వచ్చినా ప్రజలు టీడీపీని నమ్మే పరిస్థితిలేదు. తెలుగుదేశం పార్టీని బంగాళాఖాతంలోకి కలపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు' అని మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ అన్నారు. ఆదివారం రొద్దం మండలంలోని సానిపల్లి, చోళేమర్రి, నల్లూరు, చిన్నమంతూరు, చెరుకూరు, పెద్దమంతూరు, కలిపి గ్రామ పంచాయతీల్లో పర్యటించి బూత్ కమిటీల బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. మంత్రి ఉషశ్రీచరణ్‌మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు సమిష్టిగా వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు చెప్పే తప్పుడు మాటలను నమ్మి ఎవరూ మోసపోద్దన్నారు. పెనుకొండ కియా వద్ద రా కదిలిరా సభలో ప్రభుత్వాన్ని, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులను తిట్టడానికే చంద్రబాబు వస్తున్నారని చెప్పారు. 14 ఏళ్ల సీఎంగా పని చేసిన చంద్రబాబు ప్రజలకు చేసింది శూన్యమని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, జెడ్పీటీసీ సభ్యులు పద్మావతి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతీరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, జేసీఎస్ కన్వీనర్ చిలకల రవి, సింగిల్ విండో చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి, సర్పంచులు పరమేష్, సర్పంచ్ క్రిష్టప్ప, సుబ్బమ్మ, సుభాషిణి, అశ్వర్థమ్మ, కదిమ్మ, ఎంపీటీసీ సభ్యులు శంకర్‌రెడ్డి, సదాశివరెడ్డి, వనజ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని నక్కలగుట్టకాలనీకు చెందిన 35 టీడీపీ కుటుంబాలు ఆదివారం మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారందరికీ మంత్రి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ చంద్రబాబును ప్రజలతో పాటు టీడీపీ క్యాడర్ కూడా నమ్మడం లేదన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనను చూసి ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు పలుకుతున్నారని ఆమె అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ అశోక్, సర్పంచ్ గంగాదేవి, మాజీ సర్పంచ్‌లు రమాకాంత్ రెడ్డి, లక్ష్మీనరసప్ప, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు వేణు, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు నాగభూషణరెడ్డి, కౌన్సిలర్ సుధార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలసిన ఈడిగ కులస్తులు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలో మంత్రి ఉషశ్రీచరణ్‌ను ఆదివారం ఈడిగ కులస్తులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సత్కరించారు. ఈడిగ కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తామని మంత్రి వారికి తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి, ఈడిగ సంఘం నాయకులు నగేష్, శివ, లక్ష్మీనారాయణ, పార్ధ పాల్గొన్నారు.

పారదర్శక పాలనకు పట్టం కట్టండి


సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న చరణ్‌రెడ్డి

గోరంట్ల: కుల,మత, రాజకీయలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం గోరంట్ల పట్టణంలోని వడ్డివారివీధి, మసీద్ సర్కిల్‌లోని పలువీధుల్లో సర్పంచ్ సరోజబాయి నేతృత్వంలో చరణ్‌రెడ్డి ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమాభివృద్ధిని వివరించారు. వైఎస్సార్‌సీపీమండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాంనాయక్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు బాషా, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిలమత్తూరు: మండల పరిధిలోని 44వ నంబరు జాతీయ రహదారి కోడూరు థామస్ మన్రో తోపు వద్ద స్పెషల్ పార్టీ పోలీసులు కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేస్తుండగా వీరాపురం వైపు నుంచి వచ్చిన ఓ కారు వేగంగా వెళ్లడంతో పోలీసులు ఛేజ్ చేసి పట్టుకున్నారు. కారులో తరలిస్తున్న 9 బాక్సులు (864) కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని శెట్టిపల్లికి చెందిన గంగాధర్‌ను అదుపులోకి తీసుకొని కారును సీజ్ చేశారు. ఇదిలా ఉంటే స్థానికంగా ఉండే ఓ కానిస్టేబుల్‌కు నిందితుడి సెల్ నుంచి తరచూ కాల్స్ వెళ్లినట్లు తెలిసింది.

అమరాపురం: మండల పరిధిలోని ఆలదపల్లి సమీపంలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న ఈడిగ నరసింహమూర్తిని ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ.జనర్ధన నాయుడు తెలిపారు. 288 టెట్రా ప్యాకెట్లు, 117 రాజా విస్కీతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.


స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని చూపుతున్న పోలీసులు

పరిగి: మండలంలోని ఊటుకూరులో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న చౌడమ్మ అనే మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఆమె వద్ద నుంచి 21 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మరోవైపు బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేస్తున్న పలువురికి ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఉత్సవాలు విజయవంతం చేయాలి


ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

లేపాక్షి: మండల కేంద్రంలో లేపాక్షి దేవాలయంలో ఈనెల 7వ తేదీ నుంచి 11 వరకూ నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ తెలిపారు. ఆదివారం ఆలయం వద్ద బ్రహ్మరథోత్సవ ఆహ్వాన పత్రికలను ఆయన ఆవిష్కరించారు. 9న మధ్యాహ్నం 12.30 గంటలకు బ్రహ్మరథోత్సవం జరుగుతుందన్నారు. 10న రాత్రి జరిగే పూలపల్లకీ సేవ, రాత్రంతా సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం

లేపాక్షి: మండలంలోని శిరివరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసులు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్.దీపిక బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీనివాసులు మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

700 మందికి ఉద్యోగాలు

హిందూపురం టౌన్: కాకినాడ శ్రీపీఠం అధినేత పరిపూర్ణానంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 700 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌డీజీఎస్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో దాదాపు 50 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. 2 వేల మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా 700 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు చారుకీర్తి, కేవలం వ్యవసాయశాఖ బోర్డ్ సభ్యుడు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా 'పల్స్ పోలియో'


గుడిబండ: పోలియో చుక్కలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప


పెనుకొండలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మంజువాణి

సాక్షిబృందం: పోలియో రహిత సమాజమే లక్ష్యమని ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. ఆదివారం హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలను వైద్య సిబ్బంది వేశారు.


మడకశిర మండలం హెచ్‌ఆర్ పాళ్యంలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ కవిత


హిందూపురంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ


లేపాక్షి: పోలియో చుక్కలు వేస్తున్న ఎస్ఐ గోపీ


పరిగి: పోలియో చుక్కలు వేస్తున్న సర్పంచ్ లక్ష్మీదేవి

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తూ బాధిత కుటుంబంలో సంతోషం నింపుతున్న ఏకైక సీఎం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్.దీపిక అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాయలంలో ఆదివారం హిందూపురం మండలం ముదిరెడ్డిపల్లికి చెందిన త్రివేణికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.లక్ష చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జయప్ప, నాయకులు ఆర్‌కె.ఖలీల్, మహేష్, చంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన


ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

గుడిబండ: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. మద్దనకుంట, మోరుబాగల్ వివిధ గ్రామాల్లో ఆదివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇప్పుడున్న పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మళ్లీ వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టాలన్నారు. కుంచిటి, వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి శివకుమార్, జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ


విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: జిల్లా కరాటే చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో హిందూపురానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శనివారం గుంతకల్లులోని వివేకానంద పార్కు ఏఎస్ గోజు ర్యూ కరాటే అసోసియేషన్ నిర్వహించిన కరాటే పోటీల్లో హిందూపురం నుంచి వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని మంచి ప్రతిభ కనబర్చినట్లు కరాటే మాస్టర్ ఫైరోజ్ తెలిపారు. ప్రతిభ కనబరచిన వారికి ప్రశంసాపత్రాలు, సర్టిఫికెట్లు అందించారు. 24 మంది ప్రథమ స్థానం, 16 మంది ద్వితీయ స్థానం, పది మంది తృతీయ స్థానంలో నిలిచారన్నారు.

నేడు 'వైఎస్సార్ ఆసరా'

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ ఆసరా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

భక్తిశ్రద్ధలతో కలశ స్థాపన


నగర సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు

లేపాక్షి: యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో లేపాక్షి మండలంలోని కల్లూరులో వెలిసిన దొండమ్మ దేవాలయం వద్ద ఆదివారం భక్తిశ్రద్ధలతో కలశ స్థాపన చేశారు. ఈ సందర్భంగా కై వారం తాతకు అభిషేకాలు, పూజలు, నగర సంకీర్తన, రథోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా దొనే సేవ



అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లిలో వెలసిన మైలారలింగేశ్వరస్వామికి వేర్వేరుగా దళిత, కురుబ కాలనీల్లో ఘనంగా దొనే సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. దొనేలో పాలు, పండ్లు, చక్కెర, నెయ్యి, పెరుగు తదితర వాటిని పోసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. గొరవయ్యలు ఢమరుకాన్ని చేత పట్టుకుని దొనే చుట్టూ తిరుగుతూ భూత సేవ చేశారు. అనంతరం వచ్చిన భక్తులకు దొనేలో వున్న దానిని ప్రసాదంగా ఇచ్చారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదానం చేశారు.

రజకుల అభ్యున్నతికి జగనన్న కృషి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎస్.దీపిక

హిందూపురం: రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషిచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగనేనని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్.దీపిక అన్నారు. పట్టణంలోని ఏఆర్ హాస్పిటల్ సమీపంలో బైపాస్ రోడ్డు వద్ద నిర్మించిన మడివాలమాచి దేవ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరణ చేశారు. అనంతరం ధరంపురం వద్ద జరిగిన రజకుల ఆత్మీయ సమావేశంలో దీపిక, రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా టీఎస్ దీపిక మాట్లాడుతూ సీఎం జగన్ ఏ రాష్ట్రంలో లేని విధంగా రజక వృత్తిదారులకు ఏడాదికి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారని చెప్పారు. బీసీల అభ్యున్నతికి జగనన్న ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టంకట్టాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాము, నారాయణ, రజక సంఘం నాయకులు మహిళలు పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుడిగా రంగన్న



పావగడ: బీజేపీ తాలూకా అధ్యక్షుడిగా మంగళవాడ రంగన్న నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామని రంగణ్ణ తెలిపారు.

పీర్లచావిడి నిర్మాణానికి రూ.4 లక్షల విరాళం


భూమి పూజ చేస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలో పీర్లచావిడీ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎంహెచ్.రామాంజి రూ.4 లక్షలు విరాళంగా అందించారు. కమిటీ సభ్యులు ఆంజనేయులు, మంజునాథ్, బాబాజాన్, శ్రీరాములు, గౌస్, హుమయున్, ఇర్ఫాన్, సురేష్‌రెడ్డిలకు ఆ మొత్తాన్ని ఇచ్చారు.

అ'పూర్వ' సమ్మేళనం


గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పెనుకొండ రూరల్: గుట్టూరు జెడ్పీ హైస్కూల్‌లో 1995–96లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకప్పుడు తమకు చదువుచెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.